సాక్షి
విశాఖపట్నం
గురువారం । 29 । మే । 2025


మీ సేవలు చాలు.. వెళ్లిపోండి.! 8లో


అందాల తీరంపై అలల దాడి 8లో


పలు రైళ్లకు అదనపు కోచ్‌లు 8లో

ఈ గోపాలుడి లీలలు వేరయా..



నకిలీ ఏసీబీ సీఐ వెనుక ఓ సంస్థ చైర్మన్

- ఇద్దరూ కలిసి విమానాల్లో యాత్రలు ☛ హనీట్రాప్ ద్వారా భారీగా వసూళ్లు
- పలువురు అధికారులకూ బెదిరింపులు ☛ పోలీసులతో కలిసి విందు వినోదాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సీఐ పేరుతో బెదిరిస్తూ వసూళ్లకు దిగి ఊచలు లెక్కిస్తున్న సుధాకర్‌కు తెలుగుదేశం నేత, ఓ సంస్థ చైర్మన్‌తో సత్సంబంధాలు కలిగి ఉండటం చర్చనీయాంశమవుతోంది. ఇద్దరూ కలిసి విమానాల్లో పలుమార్లు గోవా, బ్యాంకాక్ లాంటి ట్రిప్పులకు వెళ్లినట్టు కూడా తెలుస్తోంది. తాను ఏసీబీ సీఐ అని పరిచయం చేసుకుంటూ.. మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.5 లక్షలు డిమాండ్ చేసిన వ్యవహారంలో టీడీపీ నేత బలగ సుధాకర్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ కూడా ఊచలు లెక్కబెడుతున్నారు. అయితే, అసలు మొత్తం వ్యవహారంలో చక్రం తిప్పిన గోపాలుడు మరొకరు ఉన్నట్టు తెలుస్తోంది. సదరు వ్యక్తి ఓ ప్రభుత్వ సంస్థ చైర్మన్ హోదాలో అధికారం చెలాయిస్తున్నట్టు సమాచారం. నకిలీ ఏసీబీ సీఐ సుధాకర్‌తో సదరు చైర్మన్ ఎంతో అన్యోన్యంగా గోవా, బ్యాంకాక్ వంటి ట్రిప్పులకు వెళుతూ విమానాశ్రయాల్లో దిగిన ఫొటోలు తెలుగుదేశం పార్టీ అంతర్గత గ్రూపుల్లోనూ సర్క్యులేట్ అవుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు సదరు సుధాకర్‌కు పలువురు పోలీసులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులతోనూ పరిచయాలు ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో నగర శివారులోని రిసార్టుల్లో పలువురితో ఉన్న ఫొటోలు కూడా ఇప్పుడు ప్రచారంలోకి వచ్చాయి. అంతేకాకుండా అందమైన అమ్మాయిల ద్వారా పలువురు నేతలు, అధికారులతో అన్యోన్యంగా మాట్లాడిన ఆడియోలు, వీడియోలు రికార్డు చేసి హనీట్రాప్ ద్వారా లక్షలు గుంజినట్టు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో లోతుగా విచారణ చేస్తే సదరు చైర్మన్‌తో పాటు ఇతర వ్యక్తుల పాత్ర కూడా బయటకు వచ్చే అవకాశం ఉంది.



అధిష్టానానికి ఫిర్యాదుల పరంపర

చినబాబుతో తనకు మాత్రమే సత్సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటూ అధికారం చెలాయిస్తున్న సదరు నేతపై టీడీపీ నేతలే గుర్రుగా ఉన్నారు. వివిధ ప్రజాప్రతినిధులకు కూడా విలువ లేకుండా.. మాట చెల్లుబాటు చేసుకుంటుండంపై తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. అంతేకాకుండా నియోజకవర్గాలతో సంబంధం లేకుండా అన్నింటిలోనూ తలదూర్చుతుండటం కూడా ఆ పార్టీ నేతలకు నచ్చడం లేదు. ఈ నేపథ్యంలోనూ ఇప్పుడు ఈ నకిలీ ఏసీబీ సీఐ వ్యవహారంలో సదరు చైర్మన్‌పై పలువురు నేతలు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. నేరుగా టీడీపీ అధిష్టానం దృష్టికి ఇద్దరూ చనువుగా ఉన్న ఫొటోలను పంపి మరీ బాగోతాన్ని వెలికితీయాలని కోరినట్టు ఆ పార్టీ నేతలే పేర్కొంటున్నారు. ఇక సదరు సంస్థలో కూడా ఇష్టారీతిలో ప్రవర్తిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టులను కేటాయిస్తూ దండుకుంటున్న విషయాన్ని కూడా ఈ ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. మొత్తంగా నకిలీ ఏసీబీ సీఐ వ్యవహారంలో మరింత లోతుగా దర్యాప్తు చేస్తే ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అన్ని శాఖల్లోనూ వసూళ్లు

నకిలీ ఏసీబీ సీఐ సుధాకర్.. అధికార పార్టీకి చెందిన నేత, ఇతర పోలీసుల అండదండలు చూసుకుని రెచ్చిపోయినట్టు తెలుస్తోంది. సబ్ రిజిస్ట్రార్లు, రవాణాశాఖ, రెవెన్యూ, విద్యుత్ శాఖతో పాటు రాజకీయ పార్టీల నేతలనూ బెదిరించి భారీగా వసూళ్లకు తెగబడినట్టు తెలుస్తోంది. ఏసీబీ పేరుతో పలువురు అధికారుల నుంచి లక్షల్లో గుంజుకున్నట్టు సమాచారం. వీరెవ్వరూ ఫిర్యాదు చేసేందుకు ముందుకు మాత్రం రావడం లేదు. ఒకవేళ ఫిర్యాదు చేస్తే తమ మీద కూడా కేసు నమోదవుతుందనే భయమే ఇందుకు కారణమని పేర్కొంటున్నారు. ప్రధానంగా పలువురు సబ్ రిజిస్ట్రార్ల వద్ద లక్షల్లో వసూలు చేశారని తెలుస్తోంది. ఇక రెవెన్యూ శాఖలో కూడా భూలావాదేవీల్లో దండుకుంటున్న అధికారులను గుర్తించి టార్గెట్లు ఇచ్చి మరీ వసూలు చేశారనే ప్రచారం ఉంది. ఇక రవాణాశాఖలో కూడా కొద్ది మంది వద్ద లక్షల్లో వసూలు చేశారని సమాచారం. ఇక కొద్ది మంది నేతలు, అధికారులతో తమ బ్యాచ్‌లో ఉన్న మహిళల ద్వారా చనువుగా మాట్లాడించి.. ఆ మాటలను రికార్డు చేసి బ్లాక్‌మెయిల్ చేసి వసూళ్లకు తెగబడ్డారనే పేరుంది. ఒక విధంగా హనీట్రాప్‌కు పాల్పడ్డారని టీడీపీ నేతలే పేర్కొంటున్నారు. ఈ విధంగా భారీగా దండుకున్న సొమ్ముతో సదరు బ్యాచ్ జల్సాలు చేసేవారు. ప్రధానంగా గోవా, బ్యాంకాక్ వంటి ట్రిప్పులకు వెళ్లినట్టు తెలుస్తోంది. వీరందరూ విమానాశ్రయాల్లో దిగిన ఫొటోలను ఇప్పుడు టీడీపీ నేతలే ప్రచారం చేస్తున్నారు. అంతేకాకుండా అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది.

కోళ్ల వ్యర్థాల కోసం కుమ్ములాటలు!

చెరో వర్గం వైపు కూటమి నేతలు





- నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లిన గండి బాబ్జీ?
- మరో వర్గంపై కేసు పెట్టాలని మహారాణిపేట పోలీసు స్టేషన్‌లో చిందులు
- సముదాయించిన పోలీసు సిబ్బంది
- తమ మనుషులే సేకరిస్తారంటూ అల్టిమేటం
- పట్టుకున్న వాహనాలను వదిలేసిన జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, విశాపట్నం:

కోళ్ల వ్యర్థాల కోసం కూటమిలో కుమ్ములాటలు **పతా**కస్థాయికి చేరుకున్నాయి. ఒకవైపు అధికారికంగా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లకు కూటమి పార్టీలోని కొందరు నేతలు మద్దతు ఇస్తుండగా.. అనధికారికంగా కోళ్ల వ్యర్థాల సేకరణ చేస్తున్న వారిని కూటమి పార్టీలోనే మరికొందరు నేతలు వెనకేసుకొస్తున్నారు. ఈ వ్యవహారమై టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ నేరుగా మహారాణిపేట పోలీసు స్టేషన్‌కు చేరుకొని చిందులేసినట్టు తెలుస్తోంది. దండుబజారులో జరిగిన గొడవలో అవతలివారిపై కేసులు పెట్టాలంటూ పోలీ**సు**లపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. అంతేకాకుండా **జీవీ**ఎంసీ అధికారులపై బూతులు లంకించుకోవడంతో**పాటు** కోళ్ల వ్యర్థాలను తమ మనుషులే సేకరిస్తారని.. ఎలా అడ్డుకుంటారంటూ గట్టిగా కేకలు వేసినట్టు తెలుస్తోంది. అయితే, ఏకంగా కోళ్ల వ్యర్థాలపై కూటమిలో ఈ స్థాయిలో కుమ్ములాటలు వెనుక నెలవారీ మామూళ్ల వసూలు కథ ఉన్నట్టు చర్చ జరుగుతోంది.

అంతటా వారే...

ఇప్పటికే కోళ్ల వ్యర్థాల సేకరణలో కూటమి పార్టీలకు చెందిన అనుచరులు ఒక్కో జోన్‌ను తీసుకున్నారు. ఇప్పుడు మరో వర్గం తమ వ్యక్తులను అనధికారికంగా కోళ్ల వ్యర్థాల సేకరణకు పురమాయించారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవల వ్యవహారం పోలీసు స్టేషన్ వరకూ చేరినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే గండి బాబ్జీ రంగ ప్రవేశం చేసినట్టు తెలుస్తోంది.



స్టేషన్‌లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తే..

ఇప్పటికే విశాఖ నగరంలో రాత్రి సమయాల్లో గుండాలు, రౌడీలు ముఖానికి మాస్కులు వేసుకొని మరీ దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. సాగర్‌నగర్‌తో పాటు బీచ్ రోడ్డులోని శాంతి ఆశ్రమంలోనూ రౌడీలు హల్‌చల్ చేశారు. నగరంలో ఒకవైపు శాంతి భద్రతలు రోజురోజుకీ దిగజారిపోతున్నాయనే విమర్శలున్నాయి. పోలీసులు చేష్టలుడిగి చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏకంగా ఒక పార్టీ జిల్లా అధ్యక్షుడు నేరుగా పోలీసు స్టేషన్‌లో చిందులు వేయడంతో పోలీసుల పట్ల **గౌరవ**ం మరింతగా దిగజారిపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోం**ది. ఈ** వ్యవహారంలో మహారాణిపేట పోలీసు స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరాల పుటే**జీలను పరిశీలి**స్తే మొత్తం వ్యవహారం బయటపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై కలెక్టర్‌తో పాటు పోలీసు కమిషనర్ కూడా విచారణ చేసి నివేదికను సిద్ధం చేసే పనిలో ఉన్నట్టు సమాచారం.

అనధికారిక వ్యక్తుల ప్రవేశంతో..

జీవీఎంసీలోని 8 జోన్లకు సంబంధించి 8 మందికి టెండర్లను అప్పగించారు. జీవీఎంసీ పరిధిలో చికెన్, మటన్ షాపుల నుంచి వ్యర్థాలను సేకరించి కాపులుప్పాడకు తరలించాల్సి ఉంటుంది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు ఒక వర్గం మద్దతు ఇస్తోంది. కూటమి నేతల్లోని మరో వర్గం పేరుతో కొద్దిమంది వ్యక్తులు ఈ చికెన్ వ్యర్థాలను సేకరిస్తూ.. తూర్పుగోదావరి జిల్లాతో పాటు అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట, యలమంచిలి, మాడుగుల నియోజకవర్గాల్లోని చేపలు, రొయ్యలకు ఆహారంగా తరలిస్తున్నారు. ఈ విధంగా జోన్–4, 5తో పాటు జోన్–8లో ఈ వర్గం చికెన్ వ్యర్థాలను బెదిరింపులకు పాల్పడుతూ బొలెరో వాహనాల ద్వారా సేకరిస్తోంది. ఇందుకోసం రూ.16 లక్షల వరకూ మరో వర్గం నేతలు వసూలు చేసినట్టు తెలుస్తోంది. జనసేన ఎమ్మెల్యేతో పాటు మరో టీడీపీ నేత పేరు చెప్పి... అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది.

దౌర్జన్యం చేశారని ఫిర్యాదుతో..

ఏప్రిల్ 28వ తేదీన దండుబజారు వద్ద అనధికారికంగా చికెన్ వ్యర్థాలను సేకరిస్తుండగా వెటర్నరీ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. అయితే తమపై దౌర్జన్యానికి దిగారంటూ అనధికారికంగా చికెన్ వ్యర్థాలు సేకరిస్తున్న వ్యక్తులు మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దండు బజారులో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు విచారించగా.. గొడవ జరగలేదని తేలడంతో పోలీసులు కేసులు నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో కేసులు ఎలా నమోదు చేయరంటూ గండి బాబ్జీ రంగంలోకి దిగి నేరుగా మే 1వ తేదీ మధ్యాహ్నం పోలీసు స్టేషన్‌కు వచ్చి చిందులు వేసినట్టు తెలుస్తోంది. ఎస్ఐ, ఇతర పోలీసు సిబ్బంది లోపలికి రండి అంటూ గండి బాబ్జీని చల్లబరిచే ప్రయత్నం చేశారు. జీవీఎంసీ అధికారులను బూతులు కూడా తిట్టినట్టు సమాచారం. మరోవైపు పట్టుకున్న వాహనాలను వెంటనే వదిలేయాలని కూడా జీవీఎంసీ అధికారులను ఆదేశించినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే వెంటనే వాహనాలను వదిలేసినట్టు సమాచారం.

యువత కృషితోనే పార్టీకి పునర్వైభవం


వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యవర్గంతో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

- ఈ కష్ట కాలంలో ప్రతి ఒక్కరికీ పార్టీ తోడుంటుంది
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై చేస్తున్న దాడులకు, కుట్రలకు భయపడాల్సిన పనిలేదని, ప్రతి ఒక్కరికీ పార్టీ తోడుగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు భరోసానిచ్చారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉరుకూటి చందు ఆధ్వర్యంలో జిల్లా యువజన విభాగం సమన్వయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కింది స్థాయి కార్యకర్తల పట్ల అభిమానం, ప్రేమ కలిగిన నాయకుడు జగన్ అని, ఆయన గుండెల్లో ప్రతి కార్యకర్తను గొప్పగా నిలబెట్టాలనే ఆలోచన ఉంటుందన్నారు. 2029లో పార్టీ అధికారంలోకి వచ్చాక నూటికి నూరు శాతం పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేకూరేలా జగన్ 2.0 పాలన ఉంటుందన్నారు. అధికారంలోకి వచ్చాక ఏ కార్యక్రమం చేపట్టినా కింది స్థాయి కార్యకర్త ద్వారా స్థానికంగా ఉన్న ప్రజలకు లబ్ధి చేకూర్చేలా మాత్రమే కార్యాచరణ ఉంటుందన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రెండేళ్ల కరోనాతో ఇబ్బంది పడ్డామని, తాము ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా కోర్టు కేసులు వేసేవారని ఆక్షేపించారు. మెడికల్ కాలేజీలు, కొత్త కంపెనీలు ఏర్పాటుచేసినా కోర్టు కేసులు వేసేవారని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలో లొసుగుల్ని ఆసరాగా తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుపడేవారని తెలిపారు. పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే యువత పాత్ర చాలా కీలకం అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నా జానకిరామ్, పి.వి.సురేష్, ఉరుకూటి చందు, ఇమ్రాన్, పార్టీ నాయకులు రవి రెడ్డి, వాసు, రాయపురెడ్డి అనిల్, మువ్వల సంతోష్, ఎల్లపు శ్రీను, వార్డు యూత్ ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

30 వరకు యోగా పోటీలు

విశాఖ విద్య: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో ఈ నెల 30 వరకు గ్రామ, వార్డు స్థాయిలో మూడు కేటగిరీల్లో యోగా పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు డీఈవో ప్రేమ్‌కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ జోగ చంద్రశేఖర్ రావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవారు తమ ఆధార్ కార్డుతో సచివాలయ పరిధిలోని ఏదైనా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంప్రదించి ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. పూర్తి వివరాలకు 83280 42021, 92472 99681కు సంప్రదించవచ్చు.

వేసవి శిక్షణ శిబిరాలకు మంగళం?

- కూటమి నిర్లక్ష్యం.. పట్టించుకోని జీవీఎంసీ
- మరో 15 రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం
- ప్రభుత్వ తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం



డాబాగార్డెన్స్: వేసవి సెలవులంటే పాఠశాల విద్యార్థులకు, చిన్నారులకు పండగనే చెప్పాలి. స్నేహితులతో కలిసి ఆటలాడుకుంటూ వినోదం, ఉల్లాసం, ఉత్సాహాన్ని పొందుతుంటారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, నైపుణ్యాలు పెంపొందించేందుకు ఏటా జీవీఎంసీ వేసవి సమయాన్ని వినియోగించుకుంటూ పలు అంశాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించేది. కానీ ఈ ఏడాది మాత్రం వేసవి శిక్షణ శిబిరాలకు మంగళం పాడేసింది. వార్షిక పరీక్షలు ముగిసి, వేసవి సెలవులు వచ్చి నెల రోజులు దాటినా శిబిరాలు ప్రారంభించకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఎంతో ఉత్సాహంగా జరిగే ఈ శిబిరాలు జీవీఎంసీ, కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల వేసవి ఆనందాన్ని, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను దెబ్బతీశాయని ఆవేదన చెందుతున్నారు.

ప్రణాళిక ఏది?

గతంలో వార్షిక పరీక్షలకు నెల రోజుల ముందే వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు పక్కా ప్రణాళికలు సిద్ధమయ్యేవి. పాఠశాలల సంఖ్య, క్రీడా ప్రాంగణాల లభ్యత, కోచ్‌ల వివరాలు, శిక్షణ సమయాలు వంటి కీలక అంశాలపై కసరత్తు జరిగేది. పరీక్షలు ముగిసిన వెంటనే ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లతో సమావేశమై విధివిధానాలు ఖరారు చేసేవారు. కానీ ఈ ఏడాది కూటమి ప్రభుత్వం గానీ, జీవీఎంసీ గానీ ఆ దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. జీవీఎంసీకి పూర్తి స్థాయి కమిషనర్ లేరు. ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌పై అదనపు బాధ్యతల భారం వంటి సాకులు చెబుతున్నా.. మేయర్ పీలా శ్రీనివాసరావు కూడా ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించడం శోచనీయం. వారి నిర్లక్ష్యం, ముందుచూపు లేకపోవడం వల్లే నేటికీ శిబిరాల నిర్వహణపై స్పష్టత కొరవడింది.

ప్రయోజనం లేని సమావేశం

నగరంలో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణపై ఈ నెల 8న విశాఖ కిక్ బాక్సింగ్ అసోసియేషన్‌లతో మేయర్ పీలా శ్రీనివాస్ ఆర్భాటంగా సమావేశం నిర్వహించి దాదాపు 20 రోజులు గడిచింది. అయితే క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి లేకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోంది. ఈ మొక్కుబడి సమావేశాలు ప్రజలను మభ్యపెట్టడానికేనా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శిక్షకులు సైతం ప్రభుత్వ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవి శిక్షణ శిబిరాలు సాధారణంగా సెలవులు ముగిసేలోపు పూర్తి చేయాలి. కానీ ఇప్పటివరకు కనీసం కౌన్సిల్ ఆమోదం కూడా పొందకపోవడంతో ఈ శిబిరాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. వచ్చే నెల 6న కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం ఉన్నప్పటికీ అప్పటికి పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడానికి కేవలం ఆరు రోజులు మాత్రమే మిగిలి ఉంటాయి. దీంతో ఈసారి వేసవి శిక్షణ శిబిరాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడేసిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగా వేలాది మంది విద్యార్థులు వేసవి సరదాను, కొత్త విషయాలు నేర్చుకునే అవకాశాన్ని కోల్పోయినట్టే!

అసమర్థ పాలన



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తోంది. జీవీఎంసీ కమిషనర్ బదిలీ జరిగి నాలుగు నెలలు గడుస్తోంది. 8 జోనల్ కార్యాలయాలు, 98 వార్డులు, 25 లక్షలకు పైగా జనాభా ఉన్న జీవీఎంసీకి ఇంత వరకు కమిషనర్‌ను నియమించలేని అసమర్థ ప్రభుత్వం ఇది. ఇంకా వేసవి శిక్షణ శిబిరాలను ఏం నిర్వహిస్తుంది? కూటమిలోని పార్టీల మధ్య సమన్వయం కొరవడడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. కనీసం పిల్లల కోసం వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించాలనే ఆలోచన కూడా జీవీఎంసీకి లేకపోవడం బాధాకరం. మేము ఏటా క్రమం తప్పకుండా వేసవి శిబిరాలు నిర్వహించాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మాజీ మేయర్, జీవీఎంసీ

ఆమోదం కోసం ఎదురుచూపులు

వేసవి శిక్షణ శిబిరాలకు సంబంధించిన అంశాన్ని మేయర్ దృష్టికి తీసుకెళ్లాం. 33 క్రీడా అంశాల్లో పిల్లలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే పలువురి కోచ్‌లతో సమావేశమయ్యాం. కౌన్సిల్ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాం.

– ఈప రాజు,
స్పోర్ట్స్ డైరెక్టర్, జీవీఎంసీ

సినిమా థియేటర్లలో సోదాలు


థియేటర్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

మహారాణిపేట : జిల్లాలోని సినిమా థియేటర్లలో బుధవారం రెవెన్యూ, అగ్నిమాపక, మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ శాఖల అధికారులు సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. భీమిలి, విశాఖ ఆర్డీవోలు సంగీత్ మాధూర్, పి.శ్రీలేఖ పర్యవేక్షణలో ప్రభుత్వం ఇచ్చిన చెక్ లిస్ట్ ప్రకారం రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించారు. గోపాలపట్నం, గాజువాక, నగరంలోని పలు థియేటర్లలో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు ఆహార పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించినట్లు సమాచారం. సినిమా ప్రదర్శన సమయాలు, పారిశుధ్యం, సీటింగ్, ఎయిర్ కండిషనింగ్ తదితర అంశాలను ప్రేక్షకులను అడిగి తెలుసుకున్నారు.

'వైజాగ్ పటం' స్పందన.. ఆశ్చర్యం!

డాబాగార్డెన్స్: 'గలీజు ఆట'శీర్షికతో 'సాక్షి'పత్రికలో బుధవారం వచ్చిన కథనానికి వైజాగ్‌పటం క్లబ్ స్పందించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆ కథనంలో క్లబ్ పేరు ఎక్కడా ప్రస్తావించనప్పటికీ.. క్లబ్ సెక్రటరీ రాజు పాత్రుడు ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక ఎమ్మెల్యే తమ క్లబ్‌ను స్వాధీనం చేసుకుని వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు నిరాధారమైనవని అందులో పేర్కొన్నారు. అయితే ఈ కథనంలో తమ ప్రస్తావన లేకపోయినా వైజాగ్‌పటం క్లబ్ స్పందించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.


అడ్మిన్ లోపలికి వెళ్తున్న కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

ఉపాధి కల్పించకుంటే మా గతేంటి?

- స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల ఆవేదన
- కొనసాగిన అడ్మిన్ ముట్టడి.. స్వల్ప ఉద్రిక్తత

ఉక్కునగరం: ఉపాధి కల్పించకపోతే తమ కుటుంబాల గతేంటని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండో రోజు బుధవారం జరిగిన ఉక్కు అడ్మిన్ ముట్టడి కార్యక్రమంలో అధికారులు, పోలీసుల వద్దకు వెళ్లి కాంట్రాక్ట్ కార్మికులు తమ గోడు వెల్లబోసుకున్నారు. అనుకున్న ప్రణాళిక ప్రకారం గేట్ల దిగ్బంధానికి కార్మికులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అడ్మిన్ భవనం వద్దకు చేరుకున్నారు. ఒకేసారి బిల్డింగ్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కాస్త తోపులాట నెలకొంది. పోలీసులు పదే పదే చెప్పినప్పటికీ కార్మి కులు పోలీసు వలయాన్ని దాటి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కొంత మంది కింద పడిపోయారు. దీంతో యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇంత కాలం పనిచేసిన తమను తీసేస్తే తమ కుటుంబాల గతేంటని ప్రశ్నించారు. సాయంత్రం వరకు అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గురు, శుక్రవారాలు కూర్మన్నపాలెం దీక్షా శిబిరం వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. శుక్రవారం రీజనల్ లేబర్ కమిషన్ చర్యల అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ముట్టడిలో పాల్గొన్న నాయకులపై కేసు నమోదు

ఉక్కు అడ్మిన్ ముట్టడిలో పాల్గొన్న నాయకులపై స్టీల్ ప్లాంట్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. స్టీల్‌ప్లాంట్ రాజభాష విభాగం జీఎం లలన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మె నేపథ్యంలో 27, 28 తేదీల్లో కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి చేపట్టాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, కార్పొరేటర్ గంగారావు, సత్యనారాయణ, కె.ఎం.శ్రీనివాస్, సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్యదర్శి నమ్మి రమణ, జి.శ్రీనివాస్, ఆర్.టి.రాజుతో పాటు సుమారు 200 కాంట్రాక్ట్ కార్మికులు ధర్నాలు చేసి రాకపోకలు సాగించే ఉద్యోగులకు ఇబ్బందులు కల్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.


ఉక్కు అడ్మిన్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న కాంట్రాక్ట్ కార్మికులు

గొలుసు దొంగకు మూడేళ్ల జైలు

విశాఖ లీగల్: మహిళ మెడలో బంగారు గొలుసు దొంగలించిన యువకుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నగరంలోని నాలుగవ అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కె.వాసుదేవరావు బుధవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. బాధితురాలికి ఐదువేల రూపాయల పరిహారం కూడా ఇవ్వాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిమిడి సూర్య కుమార్ అందించిన వివరాలివి. నిందితుడు యు.సంపత్ కుమార్ (25) ఆరిలోవ నివాసి. మహిళలు, యువతుల మెడలో బంగారు గొలుసులు దొంగలించి పారిపోవడంలో సిద్ధహస్తుడు. ఈ క్రమంలో ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డు సెక్టార్-3లోని ఒక ఇంటిపై కన్నేశాడు. మూడు రోజులపాటు అక్కడ రెక్కీ నిర్వహించాడు. 2021 జనవరి రెండవ తేదీ నుంచి మూడు రోజులపాటు ఆ ఇంటికి వచ్చి ఇల్లు అద్దెకు కావాలని కోరాడు. మూడవ రోజు మధ్యాహ్న సమయంలో ఆ ఇంటి యజమానురాలు రాయవరపు వెంకటలక్ష్మిని కత్తితో బెదిరించి మెడలో బంగారు గొలుసును తీసుకున్నాడు. ఈ క్రమంలో పారిపోతుండగా అడ్డువచ్చిన ఆమె భర్తను కత్తితో గాయపరిచాడు. స్థానికుల సహకారంతో బాధితురాలు ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ డి.విశ్వనాథం నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి 394 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఏఈఈపై విచారణ

విశాఖ సిటీ: లంచం కేసులో అరెస్టయిన ఏపీఈపీడీసీఎల్ జోన్ దొండపర్తి ఆపరేషన్ డివిజన్ గత ఏఈఈ బొచ్చు సురేష్‌పై శాఖపరమైన విచారణకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2023 డిసెంబర్ 16న ఏఈఈ సురేష్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దీనిపై అధికారులు తుది నివేదిక ఉన్నతాధికారులకు సమర్పించారు. దీంతో ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విచారణాధికారిగా ఏసీబీ ఇన్‌స్పెక్టర్ బి.సుప్రియను నియమించారు.

అందాల తీరంపై అలల దాడి

- విశాఖ తీరంలో ఆందోళనకర పరిస్థితులు
- తరచూ కోతకు గురవుతున్న బీచ్‌లు
- నేలకొరుగుతున్న కొబ్బరి చెట్లు
- ఇంకెప్పుడు రక్షణ చర్యలు?



బలంగా తీరాన్ని తాకుతున్న కెరటాలు

ఏయూక్యాంపస్: వాతావరణ మార్పుల ప్రభావం విశాఖ సుందర తీరంపై తీవ్రంగా పడుతోంది. ఒకప్పుడు ప్రశాంతంగా ఉండే సాగరతీరం.. ఇప్పుడు తరచూ కోతకు గురవుతోంది. గత దశాబ్ద కాలంలో జరిగిన నష్టం కంటే ఇటీవల తీర ప్రాంతం ఘోరంగా దెబ్బతింటోంది. రుషికొండ నుంచి ఆర్.కె.బీచ్ వరకు అడుగడుగునా తీరం కోతకు గురవడం ఆందోళనకరంగా మారింది. ఈ పరిస్థితిని అదుపులోకి తెచ్చి.. తీరానికి పునరుజ్జీవం పోయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

ప్రకృతి విధ్వంసం

గతంలో కేవలం తుపానులు, పెను తుపానుల సమయంలో మాత్రమే కనిపించే ఈ పరిస్థితి.. ఇప్పుడు అల్పపీడనాలు, ఆవర్తనాల సమయంలో కూడా తలెత్తుతోంది. యారాడ నుంచి భీమిలి వరకు సుమారు 35 కిలోమీటర్ల తీర ప్రాంతం తరచూ కోతకు గురవుతున్నట్లు నిపుణులు గుర్తించారు. యారాడ బీచ్, కోస్టల్ బ్యాటరీ, ఆర్.కె.బీచ్, కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, చిల్డ్రన్స్ పార్క్, జోడుగుళ్లపాలెం, రుషికొండ, భీమిలి వంటి ప్రాంతాలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి. సాధారణంగా నైరుతి రుతుపవనాల సమయంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటం వల్ల తీరం కోతకు గురవుతుంది. కొన్ని సార్లు ఈశాన్య రుతుపవనాల సమయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంటోంది.

కొబ్బరి చెట్ల కన్నీళ్లు

ఇటీవల పెరిగిన సముద్ర కెరటాల తీవ్రతకు కొబ్బరి వనాలు క్రమంగా కనుమరుగైపోతున్నాయి. ఒక్కొక్కటిగా నేలకొరుగుతున్నాయి. 'విక్టరీ ఎట్ సీ'ఎదురుగా పచ్చదనంతో కళకళలాడే కొబ్బరి చెట్లు ఇప్పుడు కూలిపోయాయి. వాటి వెనుక ఉన్న మరో రెండు వరసల చెట్లు కెరటాల ధాటికి దెబ్బతినే ప్రమాదంలో ఉన్నాయి. గతంలో ఈ వనాల చుట్టూ రాళ్లతో నిర్మించిన కంచె కూడా కెరటాల ఉధృతిని తట్టుకోలేకపోయింది. ఈ ప్రభావం సమీపంలోని ఇతర కొబ్బరి చెట్లపైనా పడుతుండటంతో.. వాటి భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారింది.

కూలుతున్న స్తంభాలు

సముద్ర కెరటాల తీవ్రతకు తీరంలోని ఇసుక భారీగా కోతకు గురవుతోంది. ప్రస్తుతం కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం వద్ద ఇసుక పూర్తిగా కొట్టుకుపోయింది. గతంలో ఏర్పడిన కోతను దృష్టిలో ఉంచుకుని అక్కడ రాళ్లు, కాంక్రీట్ దిమ్మెలు ఏర్పాటు చేసినప్పటికీ.. కెరటాల ప్రభావం వాటి పక్కనే ఉన్న ఇసుక మేటలపై పడుతోంది. దీంతో సబ్‌మెరైన్ సమీపంలోని కొబ్బరి వనం చుట్టూ ఉన్న ఇసుక కూడా కోతకు గురవుతోంది. మరికొన్ని రోజుల్లో ఆ వనం కూడా దెబ్బతినే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో ఈ ప్రాంతంలో వేసిన మట్టి కూడా కరిగిపోతోంది. తీరంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు, విద్యుత్ దీపాల స్తంభాలూ నేలకొరుగుతున్నాయి.

దెబ్బతింటున్న రక్షణ గోడలు

కొన్ని ప్రాంతాల్లో రహదారిని తాకేలా ఉధృతంగా కెరటాలు ఎగసిపడుతున్నాయి. దీని వల్ల రహదారికి, సముద్ర తీరానికి మధ్య నిర్మించిన రక్షణ గోడలు దెబ్బతింటున్నాయి. గత ఏడాది కాలంలో రామకృష్ణ బీచ్, పాండురంగాపురం ప్రాంతాల్లో రెండు చోట్ల రక్షణ గోడలు కూలిపోగా.. వాటి స్థానంలో కొత్తవి నిర్మించారు. అయితే కెరటాల తీవ్రత పెరుగుతుండటంతో భవిష్యత్తులో తీర ప్రాంత పరిరక్షణ మరింత సవాల్‌గా మారనుంది.

సమష్టి కృషి అవసరం

విశాఖ తీర పరిరక్షణకు తక్షణమే నిపుణుల సూచనలతో కూడిన ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉంది. జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, జిల్లా యంత్రాంగం సమష్టిగా ఈ దిశగా కృషి చేయాలి. విశ్వవిద్యాలయాలు, సముద్ర అధ్యయన శాస్త్రవేత్తలు, సివిల్ ఇంజనీరింగ్ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో తీరప్రాంత పరిరక్షణకు అనుసరిస్తున్న విజయవంతమైన పద్ధతులను అధ్యయనం చేయాలి. మన పరిస్థితులకు అనుకూలంగా ఉండే వాటిని అమలు చేయడంపై అధికారులు ఆలోచించాలని పర్యాటకులు కోరుతున్నారు.

సహజసిద్ధంగా వదిలేయాలి

విశాఖ సముద్ర తీరానికి ఒకవైపు కొండలు ఉన్నాయి. దీని ఫలితంగా అర్ధచంద్రాకార బీచ్‌లు ఏర్పడ్డాయి. వీటిని సహజంగా వదిలేయాలి. ఇక్కడ నిర్మాణాలు చేయడం, శాశ్వత కట్టడాలు ఏర్పాటు చేయడం ఎంతమాత్రం సరికాదు. అదే సమయంలో సముద్రానికి అడ్డుగా గోడ కట్టాలనుకోవడం, జియో ట్యూబ్‌లు ఏర్పాటు చేయడం మరింత నష్టాన్ని చేస్తాయి. ఇప్పటికే వీటిని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ఆర్థికంగా, పర్యావరణ పరంగా తీవ్ర నష్టం చవిచూశాం.

–ఆచార్య కాకాని నాగేశ్వరరావు, జియో ఇంజినీరింగ్ విభాగం, విశ్రాంత ఆచార్యులు

మీ సేవలు చాలు.. వెళ్లిపోండి.!

- ఏయూలో ప్రొఫెసర్ల కొరత వేళ.. ఎయిడెడ్ అధ్యాపకుల ఉద్వాసన
- వీసీకి కాలేజ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ లేఖ
- విద్యార్థుల చదువులపై ప్రభావం



ఆంధ్ర యూనివర్సిటీ పరిపాలన భవనం

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో ఫారిన్ సర్వీసుపై పనిచేస్తున్న ఎయిడెడ్ అధ్యాపకులందరినీ తక్షణమే విధుల నుంచి రిలీవ్ చేయాలని కాలేజ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ భరత్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు బుధవారం వర్సిటీకి చేరాయి. దీంతో రాష్ట్రంలోని వేర్వేరు ఎయిడెడ్ కాలేజీల నుంచి ఆంధ్ర యూనివర్సిటీకి వచ్చిన వారంతా నేడో రేపో ఇక్కడ నుంచి రిలీవ్ కానున్నారు. ఏయూలో రెగ్యులర్ అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో 2023 జూన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎయిడెడ్ కాలేజీల నుంచి ఫారిన్ సర్వీసు/డిప్యుటేషన్ కింద 80 మంది అధ్యాపకులను తీసుకున్నారు. వర్సిటీ పాలక మండలి ఆమోదంతో జరిగినందున ఉన్నత విద్యామండలి అధికారులు ఇందుకు అనుమతించారు. తర్వాత జరిగిన కొన్ని పరిణామాలతో 40 మంది వెంటనే వెనక్కి వెళ్లిపోయారు. ఒకరు మృతి చెందగా, మరొకరు ఇటీవలే మాతృస్థానానికి వెళ్లారు. ప్రస్తుతం 38 మంది ఏయూలో పనిచేస్తున్నారు.

వీసీ కీలక నిర్ణయం

ఆంధ్ర యూనివర్సిటీకి ఆర్థిక భారమవుతున్న వారిని పంపించేయాల్సిందేనని వర్సిటీలోని కొంతమంది కొంతకాలంగా పట్టుబడుతున్నారు. ప్రస్తుత వీసీ ఆచార్య రాజశేఖర్ ఇటీవల క్యాంపస్ కాలేజీల డీన్లు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులతో సమావేశమయ్యారు. ఎయిడెడ్ అధ్యాపకుల విషయంలో వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వారిని పంపించేయాల్సిందేనని మెజార్టీ విభాగాధిపతులు, ప్రిన్సిపాళ్లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంతో వీసీ కీలక నిర్ణయం తీసుకున్నారు. వారిని వర్సిటీ నుంచి రిలీవ్ చేస్తామని ఈ నెల 19న కాలేజ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు నివేదించారు. ఈ నేపథ్యంలో ఎయిడెడ్ అధ్యాపకులంతా తదుపరి పోస్టింగ్ కోసమని కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనరేట్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆచార్యుల కొరత తీరేదెలా.?

ఏయూలో రెగ్యులర్ ప్రొఫెసర్ల కొరత తీవ్రంగా ఉంది. వెయ్యి మందికి పైగా అధ్యాపకులు ఉండాల్సిన ఏయూలో ప్రస్తుతం రెండు వందల్లోపే రెగ్యులర్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. దీంతో ఎయిడెడ్, కాంట్రాక్టు, అతిథి అధ్యాపకులే బోధనలో కీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం 38 ఎయిడెడ్ అధ్యాపకులు రిలీవ్ చేస్తే.. ఆ స్థానాలను వేరే మార్గాల్లో భర్తీ చేయాలి. 2025–26 విద్యా సంవత్సరానికి సిద్ధమవుతున్న సమయంలో ప్రొఫెసర్ల కొరతను అధిగమించేందుకు వీసీ దృష్టి సారించాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు

31 నాటికి రిలీవ్ చేస్తాం

ఏయూలో పనిచేస్తున్న ఎయిడెడ్ అధ్యాపకులను వెంటనే పంపించాలని కాలేజ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఎయిడెడ్ అధ్యాపకులను ఏయూలో కొనసాగించుకుంటారా? లేదా అని ఇటీవల డైరెక్టర్ నుంచి లేఖ వచ్చింది. దీనిపై తమ పరిధిలో నిర్ణయం తీసుకుని వారిని పంపించేస్తామని నివేదించాం. ఈ నెల 31న నాటికి ఎయిడెడ్ అధ్యాపకులందరినీ ఇక్కడ నుంచి రిలీవ్ చేస్తాం.

– ఆచార్య ధనుంజయరావు, రిజిస్ట్రార్

మాజీ సీఎం ఎన్టీఆర్‌కు ఘన నివాళి

మహారాణిపేట: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతి వేడుకలు బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా యంత్రాంగం అధికారికంగా ఈ కార్యక్రమాలను నిర్వహించింది. బీచ్‌రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తన క్రమశిక్షణ, అంకితభావంతో రాష్ట్ర ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు మధుసూదనరావు, శేష శైలజ, సీఎంవో నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బీచ్‌రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరేందిరప్రసాద్

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కలెక్టర్‌కు ఏపీయూడబ్ల్యూజే వినతి

మహారాణిపేట: జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు నాలుగు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు యూనియన్ నేతలు కలెక్టర్ ఎం.ఎన్.హరేంద్ర ప్రసాద్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో అర్హులైన జర్నలిస్టులను గుర్తించి వారికి ఆనందపురం, సబ్బవరం, పెందుర్తి మండలాల్లోని ప్రభుత్వ భూముల్లో స్థలాలు కేటాయించాలని యూనియన్ అధ్యక్షుడు కె.రాము, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు కోరారు. ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదిక పంపుతానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు రామచంద్రరావు తెలిపారు. యూనియన్ ప్రతినిధులు బి.నారాయణ రావు, డి. హరినాథ్, రవి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జూన్ ఒకటి నుంచి జూలై ఒకటి వరకు ఆయా తేదీల్లో నడిచే పలు రైళ్లకు అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. పూరి–యశ్వంత్‌పూర్(22883) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్–పూరి(22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు థర్డ్ ఏసీ ఏకానమీ కోచ్, సంబల్‌పూర్–నాందేడ్ (20809) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, నాందేడ్–సంబల్‌పూర్(20810) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్ కోచ్‌లను జత చేస్తున్నారు. సంబల్‌పూర్–ఈరోడ్(08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఈరోడ్–సంబల్‌పూర్(08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్ కోచ్‌లను, విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం(58506/58505) పాసింజర్‌కు స్లీపర్ క్లాస్ కోచ్‌ను, విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్, కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్‌కు స్లీపర్ క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నారు. విశాఖపట్నం–ఎస్ఎంవీ బెంగళూరు(08581) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు–విశాఖపట్నం(08582) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–తిరుపతి (08547) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి–విశాఖపట్నం(08548) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–చర్లపల్లి (08579) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, చర్లపల్లి– విశాఖపట్నం(08580) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లకు ఒక్కో థర్డ్ ఏసీ ఏకానమీ కోచ్‌ను జత చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం తెలిపారు.

30న జాబ్‌మేళా

సీతంపేట: కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ లిమిటెడ్ ఆధ్వర్యంలో భర్తీ చేసే ఆర్‌టీపీ/ఫార్మసిస్ట్ 30 పోస్టులకు టెన్త్/ఇంటర్/ఏదైనా డిగ్రీ/డిప్లమో/డీఫార్మసీ పూర్తి చేసిన వారు అర్హులు. 18 నుంచి 32 ఏళ్ల వయసు ఉండాలి. శ్రీరామ్ చిట్స్‌లో 30 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల కోసం ఏదైనా డిగ్రీ/ఎంబీఏ ఉత్తీర్ణులు అర్హులు. 25 నుంచి 40 ఏళ్ల వయసు ఉండాలి. ఎస్‌బీఐ కార్డు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, టీం లీడర్స్ 50 పోస్టుల కోసం ఇంటర్ ఆపై విద్యార్హత కలిగి, 18 నుంచి 32 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులు. డీమార్ట్‌లో 60 పేకర్, క్యాషియర్ పోస్టులకు టెన్త్, ఆపై విద్యార్హత ఉన్న వారు అర్హులు. 18 నుంచి 25 ఏళ్ల వయసు ఉండాలి. జాబ్ డీలర్స్ సంస్థలో టెలీ కాలర్స్, ఎలక్ట్రీషియన్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రికవరీ ఏజెంట్స్ 50 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందుకోసం టెన్త్/ఇంటర్, ఐటీఐ/డిప్లమో పూర్తి చేసి 18 నుంచి 32 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులు. టాటా విస్ట్రాన్ సంస్థలో అసెంబ్లీ ఆపరేటర్ 40 ఖాళీలకు టెన్త్/ఇంటర్/ఐటీఐ/డిప్లమో విద్యార్హతతో, 18 నుంచి 27 ఏళ్ల వయసు ఉన్నవారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https:/employment.ap.gov.in, www.ncs.gov.inలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సుబ్బిరెడ్డి సూచించారు.

రాష్ట్ర స్థాయి శిక్షణ కేంద్రంగా రేఖవానిపాలెం



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం రాష్ట్రస్థాయి శిక్షణ కేంద్రంగా ఎంపికైందని జిల్లా పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన పారిశుధ్య కార్మికులు, కార్యదర్శులు, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు ఇక్కడ శిక్షణ ఇస్తామని తెలిపారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ విషయంలో అవగాహన కల్పించారు. రేఖవానిపాలెం, మూలకుద్దు సర్పంచ్‌లు సమ్మిడి శ్రీనివాసరావు, కొయ్య రామకృష్ణారెడ్డి, పంచాయతీ విస్తరణాధికారి కె.రమేష్‌నాయుడు, కార్యదర్శులు ఎస్.కె.సిహెచ్.వి.ప్రసాద్, వైవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు

మహారాణిపేట: జూన్ 21న విశాఖ వేదికగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా గురువారం నుంచి సచివాలయ స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. యోగా అసోసియేషన్ సభ్యులతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశమైన ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. సచివాలయానికి తొమ్మిది మంది చొప్పున యోగా శిక్షణకు ఎంపిక చేశామని, వారందరికీ మాస్టర్ ట్రైనర్లు పక్కాగా శిక్షణ అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈనెల 29, 30, 31వ తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహించాలని, వారి ద్వారా సాధారణ పౌరులకు శిక్షణ అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే యోగాసనాలపై పోటీలను పకడ్బందీగా జరిపించాలన్నారు. తొట్లకొండలో జూన్ ఒకటో తేదీన నిర్వహించనున్న యోగా ఈవెంట్‌కు అధికారులు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. అలాగే జూన్ 8న పోర్ట్ స్టేడియంలో జరిగే సీనియర్ సిటిజన్ యోగా కార్యక్రమ నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె.మాధవి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి జూన్ గ్యాలియట్, యోగా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆటోలో మరిచిపోయిన రూ.1.2 లక్షలు


బాధితుడికి అప్పగించిన పోలీసులు

మర్రిపాలెం: తమ కుమారుడి శస్త్రచికిత్స కోసం తీసుకెళ్తున్న రూ.1.20 లక్షలను రాజాబాబు అనే వ్యక్తి ఆటోలో మరిచిపోయారు. కొంతసేపటికి అతను తన పొరపాటును గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు అప్రమత్తమై ఆటోలో నగదుతో ఉన్న బ్యాగును గుర్తించి బాధితుడికి అప్పగించారు. వివరాలివి.. మర్రిపాలెంలో ఉంటున్న రాజాబాబు తన కుమారుడితో కలిసి బుధవారం ఇంటి నుంచి హైదరాబాద్ బయలుదేరారు. మర్రిపాలెం మెయిన్‌రోడ్డులో సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు వెళ్లడానికి ఆటో ఎక్కారు. హడావుడిలో తన వద్ద ఉన్న రూ.1.20 లక్షల నగదు, ఆపరేషన్‌కు సంబంధించిన పత్రాలు, దుస్తులు ఉన్న బ్యాగును ఆటోలోనే మరిచిపోయారు. ఆ తర్వాత స్టేషన్ వద్ద దిగిపోయారు. కొంత సమయం తర్వాత తన పొరపాటును గ్రహించిన రాజాబాబు వెంటనే 112కు ఫోన్ చేసి జరిగిన విషయం తెలిపారు. అక్కడే డ్యూటీలో ఉన్న కంచరపాలెం క్రైం ఎస్ఐ సూర్యనారాయణ, ఇతర సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. బాధితుడు ఇచ్చిన వివరాల ఆధారంగా ఆ ప్రాంతంలోని అన్ని ఆటోలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఒక ఆటో వెనుక సీటులో బ్యాగును గుర్తించారు. డ్రైవర్‌కు కూడా ఆ బ్యాగు తన ఆటోలో ఉందనే విషయం తెలియదు. పోలీసులు నగదుతో ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకుని.. రాజాబాబుకు అప్పగించారు. తన బ్యాగును త్వరగా గుర్తించి, డబ్బులను సురక్షితంగా అందించిన పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.





బాధితుడికి నగదుతో ఉన్న బ్యాగును అందిస్తున్న క్రైం ఎస్ఐ సూర్యనారాయణ

జయరాంకు పీఆర్వోగా పదోన్నతి



తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో చీఫ్ పబ్లిసిటీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బిర్లంగి జయరాంకు పదోన్నతి లభించింది. వాల్తేర్ డివిజన్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా ఆయన్ని నియమిస్తూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆయనకు గ్రూప్ బీ అధికారి హోదా లభించింది. ఈ మేరకు బుధవారం జయరాం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సహచర సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.





రాంగ్ రూట్‌లో రిస్క్ జర్నీ!

జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదురుగా రహదారికి మధ్య డివైడర్లు ఏర్పాటు చేశారు. దీంతో జైలురోడ్డు నుంచి జీవీఎంసీ మీదుగా రామ్‌నగర్ వెళ్లాలంటే ఆర్టీసీ కాంప్లెక్స్(సీఎం ఆర్ బిల్డింగ్) వైపు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్లాలన్నా ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సిగ్నల్ పాయింట్ వద్ద యూటర్న్ తీసుకోవాలి. ఈ అదనపు ప్రయాసను తప్పించుకునేందుకు కొందరు వాహనచోదకులు ప్రమాదకరమైన దారిని ఎంచుకుంటున్నారు. రాంగ్ రూట్‌లో అండర్ పాత్ వేలోకి వెళ్లి.. యూటర్న్ తీసుకుంటున్నారు. ఈ నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడమే కాకుండా.. ప్రమాదాలు జరిగే ఆస్కారం పెరుగుతోంది. అయినప్పటికీ కొంత మంది వాహనచోదకులు ఇష్టానుసారంగా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

